































అర్హులందరికీ పింఛన్లు అందేలా చర్యలు

శావల్యాపురం: అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నామని మండల ప్రత్యేక అధికారి ఎం.వెంకటరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామ సచివాలయాల వేల్ఫేర్ సహాయకుల పరిధిలో వివిధ కారణాలు చేత పింఛన్లు నిలుపుదల జరిగిన లబ్ధిదారుల సమగ్ర ఆధారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆధారాలు సక్రమంగా ఉండి పింఛన్ అందనివారికి వచ్చే నెలలో తప్పనిసరిగా పింఛను మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. లబ్ధిదారులు అపోహనలు నమ్మరాదన్నారు. ఆయనతో పాటు ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య, కార్యాలయ ఇబ్బంది కారుచోలు భారతి ఉన్నారు.

వర్సిటీ బాల్‌బాడ్మింటన్ జట్టుకు ఎస్‌కేఆర్‌బీఆర్ విద్యార్థి

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పురుషుల బాల్ బాడ్మింటన్ జట్టుకు ఎస్‌కేఆర్‌బీఆర్ కళాశాల విద్యార్థి వై.వెంకటేష్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.వి.నాగిరెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు ఎస్.శ్యామ్‌సుందర్ శనివారం తెలిపారు. వర్సిటీలో నిర్వహించిన అంతర్ కళాశాలల బాల్ బాడ్మింటన్ పోటీలలో తమ కళాశాల జట్టు తృతీయ స్థానం సాధించటంతోపాటు వెంకటేష్ వర్సిటీ జట్టుకు ఎంపికయ్యాడని వివరించారు. కర్నాటకలోని మంగుళూరు విశ్వవిద్యాలయంలో జనవరి 13వతేదీ నుంచి 17 వరకు నిర్వహించనున్న ఆల్‌ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల బాల్‌బాడ్మింటన్ టోర్నమెంట్‌లో వెంకటేష్ ఏఎన్‌యూకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. వెంకటేష్‌ను కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, డైరెక్టర్ కంచర్ల నరేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, కోచ్ షేక్ షమీర్ అభినందించారు.

సైడు కాల్వ మూసివేతపై ఫిర్యాదు

పరిశీలించిన అధికారులు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో సీఆర్ కళాశాల సెంటర్‌లో జాతీయ రహదారికి పడమర వైపున గల పరమేశ్వర కాంప్లెక్స్‌ను శనివారం పంచాయతీ కార్యదర్శి అర్వపల్లి శేఖర్, జాతీయ రహదారుల శాఖ సిబ్బంది పరిశీలించారు. కాంప్లెక్స్ యాజమాన్యం సుమారు వంద అడుగుల మేర సిమెంటు పైపులు వేసి జాతీయ రహదారి ప్రధాన కాలువను మూసివేస్తున్నారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. కాంప్లెక్స్ వ్యాపార దుకాణాల సౌలభ్యం కోసం కాలువ మూసివేస్తే భవిష్యత్తులో వర్షపు నీరు, మురుగు నీటి పారుదలకు ఆటంకం కలుగుతుందని ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రాంతాన్ని శనివారం పంచాయతీ కార్యదర్శి శేఖర్‌తో పాటూ జాతీయ రహదారి సిబ్బంది పరిశీలించారు. పైపులను తొలగించి వీటిస్థానంలో రెండు వైపులా గోడ నిర్మించి కల్వర్టు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వృద్ధురాలికి ఆసరా

సత్తెనపల్లి: పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ వృద్ధురాలికి స్థానికులు ఆసరా కల్పించారు. సాదువమ్మ హాస్టల్ సమీపంలో అరుగు మీద ఉన్న వృద్ధురాలని గమనించి ప్రశ్నించగా.. ఎవరో తీసుకొచ్చి అక్కడ దించేసి వెళ్లిపోయారని, తనకు ఏ దిక్కు లేదని చెప్పడంతో ఆమెను స్థానిక మాతృశ్రీ మొల్లమాంబ వృద్ధాశ్రమంలో చేర్పించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మాచవరం: భార్య కాపురానికి రాలేదన్న మనస్తాపంతో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొన్న యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కొత్త గణేశునిపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బూసి వంశీసాగర్ (22)కు మల్లవోలు గ్రామానికి చెందిన యువతితో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య మనస్పర్థలతో భార్య పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రావాలని వంశీసాగర్ భార్యను కోరగా ఆమె నిరాకరించింది. ఈ క్రమంలో నెల 27న మల్లవోలు గ్రామంలో వంశీ సాగర్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం


నోట్ బుక్స్ అందుకుంటున్న విద్యార్థులు

సత్తెనపల్లి: సమాజ సేవలో రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి, ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొడక్షన్ ఫోరం సత్తెనపల్లి డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో 12వ వార్డ్ వాల్మీకి నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం నోట్ బుక్స్ పంపిణీ చేసి, 20 మంది పేదలకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమాజ సేవలో రోటరీ భాగస్వామ్యం వహించడం గొప్ప విషయమన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఎ. శ్రీనివాసరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్, కన్స్యూమర్ రైట్స్ ప్రతినిధులు పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 11, 12వ వార్డుల కౌన్సిలర్లు బండి రాజ్యలక్ష్మి, లోక కల్యాణి, నాయకులు బండి మల్లికార్జునరెడ్డి, లోక మాధవ, రోటరీ క్లబ్ జిల్లా సమన్వయకర్త బెల్లంకొండ నాగ సాయిప్రసాద్, అధ్యక్షుడు పాయసం మహేష్ బాబు, రోటరీ క్లబ్ డైరెక్టర్లు సరికొండ రమాదేవి, మాతంగి సాంబశివరావు, ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రతినిధులు తుమ్మల వెంకటేష్, బి.కమలాకర్, మాతంగి గౌతమ్, పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

మర్రిపాలెం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి గళ్లా రాధాకృష్ణ మృతి


గళ్లా రాధాకృష్ణ (ఫైల్)

యడ్లపాడు: మర్రిపాలెం కో–ఆపరేటివ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న గళ్లా రాధాకృష్ణమూర్తి (58) బ్రెయిన్ డెడ్‌తో శనివారం మృతి చెందారు. యడ్లపాడు మండలంలోని ఉన్నవ గ్రామానికి చెందిన రాధాకృష్ణ కుటుంబం రాజకీయ నేపథ్యం కలిగిన వారే. కాంగ్రెస్‌పార్టీలో ఉంటూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. మొదట రెండు పర్యాయాలు గ్రామ పంచాయతీ వార్డు మెంబర్‌గా, ఆ తర్వాత మర్రిపాలెం నీటి వినియోగదారుల సంఘం డైరెక్టర్‌గా, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మర్రిపాలెం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. భార్య శ్రీలక్ష్మి కూడా గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా చేశారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం ఉన్నవలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఐసీడీఎస్ కార్యాలయం తనిఖీ

గురజాల : స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని శనివారం పీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొద్ది రోజుల క్రితం సూపర్ వైజర్ ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనపై విచారణ చేపట్టారు. సిబ్బందిని, స్టాఫ్‌ను అందరిని విచారించినట్లు తెలిపారు. జరిగిన విషయాన్ని నమోదు చేసుకొని, తదుపరి విచారణ ఉంటుందని పీడీ తెలిపారు.

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి

దాచేపల్లి : నగర పంచాయతీ అభివృద్ధిలో దూసుకుపోతోందని చైర్ పర్సన్ షేక్ మస్తాన్‌బీ పేర్కొన్నారు. ఒకటవ సచివాలయంలో కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. నగర పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సభ్యులు చర్చించారు. నగర పంచాయతీ పరిధిలో కనీస మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నగర పంచాయతీ అభివృద్ధికి నిధులు తెస్తున్నారని చైర్‌పర్సన్ మస్తాన్‌బీ చెప్పారు.

నవరత్నాలతో అందరికీ మేలు

గడప గడపకు మన ప్రభుత్వంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి విడదల రజిని



మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: నవరత్నాల పాలనతో ప్రజలందరికీ మేలు జరుగుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 24వ వార్డు పరిధిలోని సుబ్బయ్యతోటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి కార్యక్రమం ప్రారంభించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అందజేస్తున్నదని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు నాడు-నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వార్డు కౌన్సిలర్ షేక్ కరిముల్లా, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమలరావు, కోటేశ్వరమ్మ, కరెంటు శ్రీను, పెన్నా సాంబశివరావు, దాచేపల్లి నాగేశ్వరరావు, మహేంద్రమాస్టరు, ఉప్పాల భాస్కరరావు, సయ్యద్ బాజిబాబా, షేక్ ఇర్ఫాన్, షేక్ బాజాని, సయ్యద్ ఖాదర్‌బాబా, మహబూబ్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థినులతో కౌన్సిలర్ షేక్ షకీలా దస్తగిరి

వినుకొండ టౌన్: దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ విద్యావిధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నూతన అధ్యాయానికి నాంది పలికారని కౌన్సిలర్ షేక్ షకీలా దస్తగిరి పేర్కొన్నారు. పట్టణ శివారులోని నిర్మలా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు ప్రభుత్వం ఉచితంగా అందచేస్తున్న బై జూస్ కంటెంట్ ట్యాబ్‌లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ట్యాబ్‌లను పంపిణీ చేసిన ఆమె మాట్లాడుతూ పేదింటి చిన్నారులు కార్పొరేట్ స్థాయి విద్యను పొందాలనే లక్ష్యంతో జగనన్న విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, సిస్టర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు నూతన పింఛన్ల పంపిణీ

అమరావతి: స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూలులో ఆదివారం లబ్ధిదారులకు కొత్త పింఛన్ల పంపిణీతో పాటు పెంచిన నగదు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మాధురి తెలిపారు. ముఖ్య అతిథిగా శాసనసభ్యుడు నంబూరు శంకరరావు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొనాలని ఆమె కోరారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా శ్రీనివాసరావు

అమరావతి: పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ ఉత్తర్వుల మేరకు జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మండలంలోని అత్తలూరుకు చెందిన బంకా శ్రీనివాసరావు నియమితులయ్యారు. గుంటూరులోని కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నుంచి ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. తనను కమిటీ సభ్యుడిగా నియమించడానికి సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల సమస్యల్ని పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. అత్తలూరు వైఎస్సార్ సీపీ నాయకులు మాదినేని హరిబాబు, దత్ తదితరులు ఆయన్ను అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ సెల్ కమిటీ సభ్యుడిగా బాబు



యాసారపు బాబు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా సత్తెనపల్లి పట్టణంలోని 19వ వార్డుకు చెందిన యాసారపు బాబు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బాబు నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా యాసారపు బాబు మాట్లాడుతూ.. జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా తన నియామకానికి కృషి చేసిన సత్తెనపల్లి ఎమ్మెల్యే, భారీ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

వలంటీర్లు, కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలి

- రానున్న ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించాలి
- రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి రజిని

నాదెండ్ల: దేశంలోనే ఎక్కడాలేని విధంగా గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి, వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటి గడపవద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను దరిచేర్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త పరిపాలనా సంస్కృతికి నాంది పలికారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. నాదెండ్లలోని శివాలయం కల్యాణ మండపంలో శనివారం మండలస్థాయిలో వార్డు వలంటీర్లు, నూతనంగా ఎంపికైన పార్టీ గ్రామ కన్వీనర్ల సమన్వయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 95 శాతం పూర్తి చేశామని, వచ్చే ఎన్నికల్లో రెట్టింపు మెజార్టీ సాధించేలా పనిచేయాలన్నారు. మండల పరిధిలో 16 సచివాలయాల్లో 324 మంది వలంటీర్లు పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఒక్కో సచివాలయం పరిధిలో నూతనంగా ముగ్గురు కన్వీనర్లను ఏర్పాటు చేసి పథకాలను మరింత చేరువ చేయనున్నట్లు చెప్పారు. నూతనంగా ఎంపికైన కన్వీనర్లకు దిశా నిర్దేశం చేశారు. త్వరలో గృహ సారథులను కూడా నియమించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు వలంటీర్లు పనిచేస్తుండగా, కన్వీనర్లకు అదనపు బాధ్యతలు అప్పగించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు (లాలుపురం రాము) మాట్లాడుతూ పార్టీ పదవులు అలంకారప్రాయం కాకూడదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు, కన్వీనర్లు సేవలందించాలన్నారు. ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, మండల పార్టీ కన్వీనర్ మద్దూరి కోటిరెడ్డి, నాదెండ్ల సొసైటీ ఛైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, సర్పంచ్‌లు, స్థానిక నాయకులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి రజిని, వేదికపై జీడీసీసీ చైర్మన్ లాలుపురం రాము

ముప్పాళ్లలో 200 మద్యం బాటిళ్లు స్వాధీనం!

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల గ్రామంలోని ఓరెస్టారెంట్‌లో నిల్వ ఉంచిన రెండు వందల మద్యం బాటిళ్లను ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. అనుమతులు లేకుండా ఉన్న మద్యం నిల్వలపై పక్కాసమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈవిషయమై ఈపూరు ఎస్ఈబీ అధికారి సైమన్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలు దోహదం

- బటన్ నొక్కుడంటే సంక్షేమమని చెప్పిన ఏకైక సీఎం జగన్
- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

నరసరావుపేట: బటన్ నొక్కుడంటే రాజకీయ అర్థశాస్త్రం, సామాజికశాస్త్రంలో సంక్షేమమని దేశంలో నొక్కిచెప్పిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాదు పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆయన మీడియాతో మాట్లాడారు. పొలిటికల్ డిక్షనరీలో బటన్ నొక్కుడనే కొత్త పదాన్ని ప్రవేశపెట్టిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. బటన్ నొక్కటం ద్వారా ప్రభుత్వానికి, లబ్ధిదారులకు మధ్య ఎవరూ లేకుండా లబ్ధి చేకూర్చుతున్నందుకు సీఎం జగన్‌కు అభినందనలు తెలిపారు. దీనిని వ్యతిరేకించే వారు పేదల వ్యతిరేకులని, భవిష్యత్‌లో పేదలు వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని డొక్కా హెచ్చరించారు. పేదలు అభివృద్ధి చెందాలంటే సంక్షేమం చాలా ముఖ్యమన్నారు. జిల్లాలో శాంతి భద్రతలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. శాంతి భద్రతల విచ్చిన్నానికి ఎవరు ప్రయత్నించినా కఠినంగా అణచివేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. చంద్రబాబు నాయుడు యాత్రల పేరుతో వెడల్పు తక్కువగా ఉన్న బజార్లలో సమావేశాలు పెట్టడం వలన కలిగే దుష్ఫలితాలను కందుకూరులో చూశామన్నారు. భవిష్యత్‌లో అలాంటి సంఘటనలు పునరావృతం గాకుండా వారు వ్యవహరించాలని, సరైన జాగ్రత్తలు పోలీసులతో పాటు వారు కూడా తీసుకోవాలన్నారు.



కలెక్టరేట్ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

ఎన్‌జీఓ నూతన భవన నిర్మాణానికి సహకారం

నరసరావుపేట: ఏపీ ఎన్‌జీఓ హోం నూతన భవన నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శనివారం తన కార్యాలయంలో ఏపీ ఎన్జీఓ నరసరావుపేట యూనిట్ నూతన ఏడాది క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎన్జీవో అసోసియేషన్ హోం యొక్క పాత బిల్డింగ్ పరిస్థితి తెలియజేసి కొత్త బిల్డింగ్ కట్టుకోవడానికి సహాయ సహకారాలు అందజేయాలని అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, ఆనంద్‌నాథ్‌లు కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరావు, కోశాధికారి కోటిరెడ్డి, స్థానిక అసోసియేషన్ ఉపాధ్యక్షులు డీవీడీ ప్రసాద్, నారాయణ, రవికుమార్, సంయుక్త కార్యదర్శి రామానుజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఏపీ ఎన్‌జీఓ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు

వాటర్ డిస్పెన్సర్ బహూకరణ


వాటర్ డిస్పెన్సర్‌ను అందజేస్తున్న వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్

ఈపూరు: నరసరావుపేట డివిజన్ ఏఎస్‌డబ్ల్యూఓ ఆఫీస్‌లో శనివారం మండలంలోని వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్ అందరూ కలిసి ఎస్సీ బాలుర వసతి గృహానికి వాటర్ డిస్పెన్సర్ అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌డబ్ల్యూఓ సంతోష్ మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థుల సౌకర్యార్థం వాటర్ డిస్పెన్సర్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. మండలంలోని వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యులు చరిత్ర మరిచి మాట్లాడవద్దు

కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట: గృహ నిర్మాణాలు పూర్తి చేయకుండానే గృహ ప్రవేశాలంటూ ఆర్భాటం చేసిన చరిత్ర టీడీపీ ప్రభుత్వానిదని, గత చరిత్ర విస్మరించి టీడీపీ కౌన్సిలర్లు మాట్లాడడం అవివేకమని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని విమర్శించారు. మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం శనివారం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించారు. సమావేశానికి చైర్మన్ రఫాని అధ్యక్షత వహించారు. సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు గంగా శ్రీనివాసరావు తదితరులు లేచి ఈ నెల 17వ తేదీన అన్ని వసతులు కల్పించకుండానే టిడ్కో గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారని విమర్శలకు దిగారు. దీనికి మున్సిపల్ చైర్మన్ రఫాని సమాధానం చెబుతూ 2,272 గృహాలు అన్ని సౌకర్యాలతో పూర్తి చేయటం జరిగిందని, వాటికి సంబంధించి సకల సౌకర్యాలు కల్పించామని వివరించారు. టీడీపీ కౌన్సిలర్లు సమావేశంలో విమర్శలకు దిగడం మాని టిడ్కో గృహాలను పరిశీలించుకోవచ్చని సవాలు విసిరారు. అయినా వినకుండా టీడీపీ సభ్యులు వాగ్వాదానికి దిగడంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అన్నపురెడ్డి శ్రీలక్ష్మి, షేక్ ఖాజాభాను టీడీపీ కౌన్సిలర్ల తీరును తప్పుపట్టారు. గత టీడీపీ హయాంలో అసలు ఇళ్ల కట్టుబడి పనులు సైతం పూర్తి కాకుండానే గృహ ప్రవేశాలంటూ పాలు పొంగించే కార్యక్రమాలు నిర్వహించింది వాస్తవం కాదా అంటూ నిలదీశారు. ఈ నెల 17న లబ్ధిదారులకు టిడ్కో గృహాల పంపిణీ నిర్వహించి, బ్లాకుల వారీగా లబ్ధిదారులకు తాళాలు అందజేస్తుంటే నిజాలు విస్మరించి విమర్శలకు దిగుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పిల్లి సాగర్ బాబు మాట్లాడారు. సమావేశంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ఆమోదించారు.

రేషన్ దుకాణాల తనిఖీ


స్టాక్ రిజిష్టర్లు పరిశీలిస్తున్న డీఎస్ఓ వరలక్ష్మి

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో మూడు రేషన్ దుకాణాలను పల్నాడు జిల్లా సివిల్ సప్లయిస్ ఆఫీసర్ జి.వరలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. షాప్ నెం.23,25,26ల్లో రికార్డులు పరిశీలించి స్టాకు నిల్వల్లోని వ్యత్యాసాలు తనిఖీ చేశారు. మూడు షాపుల పరిధిలోని కొంతమంది కార్డుదారుల వద్దకు వెళ్లి స్వయంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ప్రధానమంత్రిగరీబ్ కల్యాణ్ యోజన పథకం కింద పంపిణీ చేసిన బియ్యానికి నగదు తీసుకున్నారా? తూకం సరిగా ఉంటుందా? అంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా దుకాణదారులకు పలు సూచనలు చేశారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో సిల్వర్ మెడల్


నాగసువర్ణసిరిని అభినందిస్తున్న హెచ్ఎం పి.కరిముల్లా, ఎస్ఎంసీ చైర్‌పర్సన్

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆర్.నాగసువర్ణసిరి రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ తైక్వాండో పోటీలలో సిల్వర్ మెడల్ సాధించినట్టు పాఠశాల హెచ్ఎం పి.కరిముల్లా, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.ఇజ్రాయిల్ ప్రసాద్ శనివారం తెలిపారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన తైక్వాండో పోటీలలో అండర్–17 (73–80కేజీ) విభాగంలో నాగ సువర్ణసిరి సిల్వర్ మెడల్ సాధించిందని వివరించారు. విద్యార్థినిని పాఠశాల ఎస్ఎంసీ చైర్‌పర్సన్ షేక్ షాకీరా, ఉపాధ్యాయులు అభినందించారు.

డ్వాక్రా మహిళలకు అవగాహన

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో గల ఎస్టీ కాలనీలో శనివారం జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జలజీవన్ మిషన్ టిడబ్ల్యూఎస్ ఎం. నవీన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ ద్వారా దూరప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకునే కష్టాలు ఉండవన్నారు. ప్రతి రోజూ ప్రతి వ్యక్తికి 55 లీటర్ల సురక్షితమైన నీటిని అందించటమే జలజీవన్ మిషన్ లక్ష్యమని అన్నారు. అదేవిధంగా నీరు, పారిశుధ్యంపై అవగాహన కలిగించారు. జలజీవన్ మిషన్ మండల కో–ఆర్డినేటర్ బాబూరావు, వీఏఓలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎంపీ, ఎమ్మెల్యే నూతన సంవత్సర శుభాకాంక్షలు


ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: నూతన సంవత్సరంలో అన్ని వర్గాల ప్రజలు చేపట్టే ప్రతి పనిలో విజయాలు సిద్ధించాలని, ప్రతి ముంగిట ఆనందాలు నిండాలని పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ వారిద్దరూ శనివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు ధాన్యపు సిరులతో ఆనందాలు నిండాలని, విద్యార్థులకు విద్యలో సరికొత్త అధ్యాయం మొదలవ్వాలని, ప్రజలందరికీ ఆరోగ్య భాగ్యాలు కలగాలని, అభివృద్ధి కొత్త పుంతలు తొక్కాలని, నూతన సంవత్సరం మరిన్ని సంతోషాలను నింపాలని కోరారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ


క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, పీఆర్టీయూ నాయకులు

నరసరావుపేట: పీఆర్టీయూ, ఏపీటీఎఫ్ జిల్లా డైరీ, క్యాలెండర్‌లను కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శనివారం వేర్వేరుగా ఆవిష్కరించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌మోజస్, వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు అబ్బరాజు హనుమంతరావు, బెహరా శ్రీనివాసరావు, జిల్లా నాయకులు నరేంద్ర శర్మ, ఖాజావలి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంపత్‌బాబు, ప్రధాన కార్యదర్శి శివనాగరాజు, గౌరవాధ్యక్షుడు వెంకటరెడ్డి, సాయన్న, ప్రసాదరెడ్డి, రఫీ, అబ్దుల్, సత్తార్, రమేష్, శంకర్, రాజు, ఆదయ్యా, జిలాని పాల్గొన్నారు.

శనగ పంటలో సస్య రక్షణ పాటించాలి

చిలకలూరిపేటటౌన్: శనగ పంటలో సశ్య రక్షణ పాటించాలని జిల్లా వనరుల కేంద్రం శిక్షణా కోఆర్డినేటర్ ఎం.శివకుమారి చెప్పారు. శనివారం మండలంలోని పసుమర్రు గ్రామంలో శనగపంట పొలాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనగపంటలో అక్కడక్కడ వేరుకుళ్లు, శగనపచ్చ, పచ్చ పురుగును గమనించాలని, ఉధృతి తక్కువగా ఉంటే ఎటువంటి పురుగుమందులు వాడాల్సిన అవసరం లేదన్నారు. తూనీగలు, అక్షింతల పురుగులు, మిత్ర పురుగులు ఉండటం వలన ఎటువంటి పురుగుమందులు వాడాల్సిన అవసరం లేదన్నారు. నరసరావుపేట డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ, మండల ఏఓ శ్రీలత, నాదెండ్ల వ్యవసాయాధికారి హరిప్రసాద్, యడ్లపాడు వ్యవసాయాధికారి సరిత, ఏఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): గోవా రాష్ట్రం నుంచి అక్రమంగా తయారైన మద్యాన్ని తరలిస్తున్న ఇరువురు నిందితులను ఎస్ఈబీ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఎస్ఈబీ ఏఈఎస్ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం....గోవాలో తయారైన మద్యాన్ని రెండు ద్విచక్రవాహనాలు, ఒక ట్రాలీ ఆటోలో తరలిస్తున్న యువకులను వినుకొండ రూరల్ మండలం ఏనుగుపాలెం వద్ద పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 84 మద్యం సీసాలతోపాటు రెండు ద్విచక్రవాహనాలు, ట్రాలీ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఈబీ ఏఈఎస్ తెలిపారు. మీడియా సమావేశంలో ఎస్ఈబీ సీఐ విజయభాస్కర్, ఎస్ఐ నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ముప్పాళ్ల విద్యార్థి ఎంపిక


కాటూరి దుర్గాప్రసాద్

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన బీపీఈడీ ప్రథమ సంవత్సరం విద్యార్థి కాటూరి దుర్గాప్రసాద్ అంతర్ విశ్వవిద్యాలయాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు శనివారం తెలిపారు. ఈ నెల 29,30 తేదీల్లో నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టు తరఫున జనవరి 12వ తేదీ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని మంగులూరు విశ్వవిద్యాలయంలో జరిగే ఆల్ ఇండియా విశ్వవిద్యాలయ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎంపికైన దుర్గాప్రసాద్‌ను సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపక సిబ్బంది ఎం.సురేష్, వై.సురేష్, ఆర్.బి.నాయక్, దాసలు అభినందించారు.